క్లుప్తంగా

ప్రతి కూలీకీ ఉపాధి చూపండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

గుత్తి రూరల్: గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు చూపాలని ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు సిబ్బందికి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏపీఓ మద్దిలేటితో కలిసి మండలంలోని ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో వేసవిలో వ్యవసాయ పనులు లేనందున కూలీల సంఖ్య పెంచాలన్నారు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పని దినాల లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కొలతల ప్రకారం వేతనం వచ్చేలా చూడాలన్నారు. కూలీలకు మజ్జిగ, తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో టీఏ రత్నాలు, చెన్నారెడ్డి, మైసూరారెడ్డి, లోకేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు రంగయ్య, ఈశ్వర్, గోపాల్ పాల్గొన్నారు.

మట్కా, పేకాట నిర్వహిస్తే జైలుకే

యల్లనూరు: మండలంలో ఎక్కడైనా మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకాలాపాలకు పాల్పడితే జైలుకు పంపుతామని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. బుధవారం ఆయన పెద్ద మల్లేపల్లి, నిట్టూరు తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవనం సాగించాలన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గితే వదిలే ప్రసక్తి లేదన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు

యాడికి: మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు 9 మంది విద్యార్థులు ఎంపికవడం అభినందనీయమని కోనుప్పల పాడు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రమేష్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రాథమిక పాఠశాలలో గురుకులంకు ఎంపికైన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ కౌషిక్, విక్రమ్, హేమంత్ కుమార్, ఆనంది, ఇంద్రకేతన, కిరణ్, గుణతరంగ, హరిప్రియ, మహిధర్ తదితర విద్యార్థులు 100లోపు, క్రాంతి కుమార్, లిఖిత, ప్రణీత, హరిప్రియ 200లోపు ర్యాంకు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆంజనేయులు, నాగరాజు, మురళి, సునీత, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

పామిడి: పట్టణంలోని షాదీఖానాలో గురువారం పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆయుష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు బుధవారం తెలిపారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యనిపుణులు కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్స ఉచితంగా నిర్వహిస్తారన్నారు. ఓటర్, ఆధార్, రేషన్‌కార్డుల్లో ఏదోకటి రెండు జిరాక్స్ కాపీలు, సెల్‌నంబర్‌తో శిబిరానికి రావాల్సి ఉంటుందన్నారు.

గోపాల్ ఆశయ సాధనకు కృషి



గోపాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గుంతకల్లుటౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికై అనేక ఉద్యమాలు చేసిన సీపీఐ(ఎంఎల్)న్యూ డెమొక్రసీ నేత గోపాల్ ఆశయ సాధనకు పాటుపడతామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రామిరెడ్డి కాలనీలో గోపాల్ సంస్మరణ సభ నిర్వహించారు. గోపాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాయకులు ఆయన చేసిన ప్రజా పోరాటాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి సురేష్, పట్టణ కార్యదర్శి జి.చిన్నా, ఆశాబీ, ఏసురత్నం, కృష్ణ, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చడం పుణ్యకార్యం



చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్ఎం వెంకటరమణారెడ్డి

గుంతకల్లు: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడం పుణ్యకార్యమని డీఆర్ఎం కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో స్థానిక డీఆర్ఎం కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని డీఆర్ఎం రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలు తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సుధాకర్, సూర్యనారాయణ, సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహాన్,పీఆర్ఓ మురళీ పాల్గొన్నారు.

తాగునీటి పథకానికి రూ.250 కోట్ల మంజూరు

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటన
- పుట్లూరులో సంబరాలు

పుట్లూరు: మండల ప్రజల చిరకాల కోరికను తీరుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం గండికోట– పుట్లూరు తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు నిధులు(రూ.250 కోట్లు) మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంపై మండల కేంద్రంలో సంబరాలు చేపట్టారు. ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతులు బాణా సంచా కాల్చడంతో పాటు జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో తాగునీటి ఎద్దడి ప్రజలను ఎంత ఇబ్బందులకు గురి చేసిందన్న విషయాన్ని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి స్వయంగా చూశారన్నారు. హెచ్చెల్సీ నీటిలో తమ మండలానికి రావాల్సిన నీటి కోసం రోడ్డెక్కి ఆందోళనలు చేయాల్సిన దుస్థితి మండల ప్రజలకు నెలకొందన్నారు. ఈ కష్టాలను తొలగిస్తూ రూ.250 కోట్లు మంజూరు చేయడంతో పాటు మూడు నెలల్లో పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడం హర్షణీయమన్నారు. ఎంపీపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మూలి వెంకటరామిరెడ్డి, సర్పంచ్‌లు ఓబుళేషు, మహేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ నాగేశ్వరరావు, నాయకులు బీమేశ్వరరెడ్డి, రామాంజులరెడ్డి, సురేష్, శేఖర్, సత్య తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, నాయకులు

తాడిపత్రి అభివృద్ధికి జేసీనే అడ్డు



ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడుతున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి: తాడిపత్రి అభివృద్ధికి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అడుగడుగునా అడ్డుతగులుతున్నారని వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ×తాడిపత్రి అభివృద్ధికి జేసీనే అడ్డు× అన్న నినాదంతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేస్తున్న, చేసిన అభివృద్ధిని వివరించడంతో పాటు జేసీ ప్రభాకర్‌రెడ్డి అభివృద్ధి పనులను అడ్డుకుంటున్న వైనంపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. స్థానిక గాంధీ సర్కిల్ నుంచి సీబీరోడ్డు మీదగా యల్లనూర్ రోడ్డు సర్కిల్, కొత్త కూరగాయల మార్కెట్, అంబేద్కర్ నగర్ వద్ద నిర్మాణంలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రం వరకు వైఎస్సార్‌సీపీ శ్రేణుతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దారి పొడవునా ప్రజలకు అవగాహన కల్పించారు. తాడిపత్రిలో అభివృద్ధి పనులు చేపడితే జరిగే మేలు ప్రజలకేనని, ఈ విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుతోపాటు పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేస్తే జేసీ వచ్చిన నష్టం ఏమిటని ప్రశ్నించారు. ఇదే విషయంపై వార్డుల్లో పర్యటించిప్పుడు జేసీని నిలదీయాలని ప్రజలకు సూచించారు. గతంలో ఏఈగా పని చేసిన జయభారత్‌రెడ్డి ఐదేళ్లపాటు మున్సిపల్ కమిషనర్‌గా ఎలా పని చేశాడో ప్రశ్నించాలన్నారు. గతంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్న సమయంలో తన వర్గీయుడికి చెందిన కుటుంబ సభ్యులందరి పేరున ఏకంగా 40 మున్సిపల్ షాపు రూములను ఎలా కట్టబెట్టారో నిలదీయాలని సూచించారు. జేసీ తన స్వార్థం కోసం తప్ప ప్రజల కోసం ఏనాడు పోరాడలేదన్నారు. ప్రజలకు మంచి జరిగితేనే సహించలేనోడు భవిష్యత్తులో తాడిపత్రికి ఇంకేం చేయగలడో ఆలోచించాలని కోరారు. ఆయన వెంట కౌన్సిలర్ రాఘవేంద్ర, ఎంపీటీసీ రవికుమార్, నాయకులు బాబా, జావీద్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి డీఎస్పీగా సీఎం గంగయ్య



తాడిపత్రి అర్బన్: తాడిపత్రి నూతన డీఎస్పీగా సీఎం గంగయ్య నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న వీఎన్‌కె చైతన్యను అన్నమయ్య జిల్లా రాజంపేటకు బదిలీ చేశారు. డీఎస్పీ సీఎం గంగయ్య గతంలో తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్‌లో 1996 నుంచి 1997 వరకు ఎస్ఐగా పనిచేశారు. ఇక్కడి నుంచి అనంతపురం ఎస్‌బీ, వన్‌టౌన్‌లో ఎస్ఐ పని చేసి అక్కడి నుంచి పదోన్నతిపై విజయవాడకు ఏసీబీ సీఐగా బదిలీ అయ్యారు. తర్వాత ధర్మవరం, మదనపల్లి ధఐగా పనిచేశారు. అనంతరం 2014లో అనంతపురం ఎస్‌బీ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత కర్నూలు ట్రాఫిక్, తిరుపతి ఎస్‌బీ డీఎస్పీగా పని చేశారు. పలమనేరు డీఎస్పీగా ఉన్న ఆయనను రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సాధారణ బదిలీల్లో తాడిపత్రి డీఎస్పీగా నియమించారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు



లక్ష్మి | భావన | జి.ప్రశాంతి | సంధ్య | మహబూబ్‌బీ | ఇబ్రికా తరన్నుమ్ | మహమ్మద్ యూసుఫ్ | లేఖన | శృతి

గుంతకల్లుటౌన్: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో చదువుతున్న బాలబాలికలు సత్తాచాటారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండియర్ ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) ఒకేషనల్ కోర్సు చదువుతున్న జి.ప్రశాంతి 944 మార్కులు, ఎల్.సంధ్య (ఎంపీసీ)908, మహమ్మద్ ఆసిఫ్(సీఎస్ఈ) 897, యు.నాగరాజు(బైపీసీ)878, కె.ఉమామహేశ్వరి(డీఎంఎల్‌టీ)870,పి.జానకిరాముడు(హెచ్ఈసీ) 834 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ సాలాబాయి తెలిపారు. ఫస్టియర్‌లో ఎంపీసీకి చెందిన మహబూబ్‌బీ(428), శ్రావణి(403) మార్కు లు సాధించినట్లు ఆమె వెల్లడించారు. ఇక శ్రీశంకరానంద ఎయిడెడ్ జూనియర్ కళాశాలకు చెందిన సెకండియర్ ఎంపీసీకి చెందిన రుక్షిత(933), గాయత్రి(932),తులసీ(914), బైపీసీకి గ్రూప్‌కు సంబంధించి ఇబ్రికా తరణ్ణమ్(970), యు.పర్వీన్(945), లిఖిత(938), పవిత్ర(935), ఎం.టీ.మిస్బా(932), భారతి (920), అయేషా జహన్(సీఈసీ)915 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ సి.బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఇక ఫస్టియర్ ఎంపీసీలో మహమ్మద్‌యూసుఫ్(455), మహమ్మద్ ఇజాజ్(440), అమర్‌నాథ్‌రెడ్డి(440), పూజిత(400), బైపీసీ గ్రూప్‌కు సంబంధించి పావని(390) మార్కులు సాధించినట్లు వివరించారు.

తాడిపత్రి టౌన్: ఇంటర్ ఫలితాల్లో తాడిపత్రి విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండియర్ ఎంపీసీ వి.నాగేష (896/1000) , వై .కార్తీక్ (853/1000), టి.శివనందిని (836/1000), బైపీసీ విభాగంలో జి.ధాత్రి (781/1000), వనజ (775/1000), హెచ్.ముబశిర (689/1000), సీఈసీ విభాగంలో రంగారెడ్డి (680/1000), విజయ్ (669/1000), లావణ్య 636/1000) మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. ఫస్టియర్‌లో 74 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

గార్లదిన్నె: స్థానిక కస్తూర్బా బాలిక విద్యాలయం విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ నాగసత్య మాట్లాడుతూ పాఠశాలలో 11 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రీస్కూల్ టీచర్ ట్రెనింగ్ కోర్సులో చేరగా మొదటి ఏడాదిలో 55 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. వారిలో శృతి 460 మార్కులు, లేఖన 447 మార్కులు, హేమలత 428 మార్కులు సాధించారు.

యల్లనూరు: కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రత్యేకాధికారి బుధవారం మాధవిరెడ్డి తెలిపారు. ఫస్టియర్‌లో సీఈసీ విద్యార్థిని లక్ష్మీ 375 మార్కులు, భావన 308 మార్కులు (సీఈసీ) సాధించారు. దర్శ పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో అఖిల (328), సెకండియర్ ఎంపీసీలో భవిత(626), వాసంతి(724), శ్రావణి(843), పురుషోత్తంరెడ్డి(808), ఓంకాంత్ (691) మార్కులు సాధించారు. సీఈసీలో నాగజ్యోతి(625), అనిత (623),అపర్ణ (501), శివమల్లిక(554),రజిత (718), బైపీసీలో మహిమజ్యోతి (701) మా ర్కులు సాధించినట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటపతి తెలిపారు. ఆదర్శపాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ పరీక్షల్లో 40 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

పామిడి: ఇంటర్ ఫలితాల్లో మోడల్‌స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎంపీసీలో ఎస్తేరు రాణి 984, బైపీసీలో నివేదిత 975), నవ్య(945), వైష్ణవి(918), ఎంఈఎస్‌లో కులుసున్ బేగమ్ 973, సీఈసీలో హిమబిందు(820) మార్కులు సాధించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సంబంధించి సీఈసీలో అర్చన914, బైపీసీలో మునీంద్ర880, హెచ్ఈసీలో సునంద 820, ఒకేషనల్‌లో సురేంద్ర 815, ఎంపీసీలో మంజుల 714 మార్కులు సాధించారు.

'జగనన్నే మా భవిష్యత్తు'కు ఆదరణ



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని గుత్తి ఆర్ఎస్ 3వ వార్డులో బుధవారం చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమనికి ఆదరణ లభించింది. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిందె వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గురుప్రసాద్ యాదవ్‌ల నేతృత్వంలో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హులై ఉండి పథకాలు అందకుంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ప్రతి ఇంటికి అతికించారు. సచివాలయ కన్వీనర్లు జబీర్, సువర్ణ, గృహసారథులు కరీం, సాయి చరణ్, షబ్బీర్, భేటీ బాషా, షావలి, రామాంజి, కరీమ్, కుట్టి, రియాజ్, వార్డు వలంటీర్లు పురుషోత్తం, ఇమ్రాన్, అనూష, సులోచన,జనార్దన్, రూయిబాను, వైఎస్సార్ సీపీ నాయకులు టైలర్ క్రిష్ణ, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం



నార్పలలో బుధవారం జరిగిన జగనన్న వసతి దీవెన సభకు హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ శమంతకమణి, ఆమె కుమారుడు అశోక్, అనంతపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ భోగతి నారాయణరెడ్డి, గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి తదితరులు

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

తాడిపత్రి టౌన్: పట్టణంలోని 31వ వార్డు శ్రీనివాసపురంలో గురువారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

క్రీడా కోచ్‌లకు నోటీసులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కోచ్‌లకు నోటీసులను బుధవారం జారీ చేసినట్లు జిల్లా చీఫ్ కోచ్ జగన్నాథరెడ్డి తెలిపారు. ఫెన్సింగ్ క్రీడకు సంబంధించి ఖేలో ఇండియా కోచ్ రవీంద్ర, డీఎస్ఏ కోచ్ ప్రతాప్‌కు నోటీసులను అందించినట్లు ఆయన తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారికి నోటీసులు జారీ చేశామన్నారు.

విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ 6.38 కోట్లు

తాడిపత్రి టౌన్: నార్పలలో బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న వసతి దీవెన కార్యక్రమంలో విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో బటన్ నొక్కి నిధులు జమ చేశారు. తాడిపత్రి నియోజవర్గం వ్యాప్తంగా 6702 మంది విద్యార్థుల తల్లులకు జగనన్న వసతి దీవెన కింద రూ.6.38 కోట్లు జమ చేసినట్లు తాడిపత్రి సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి పక్కీరయ్య తెలిపారు. తాడిపత్రి పట్టణంలో 2240 మందికి రూ.2,14,02,500, రూరల్ పరిధిలో 1412 మందికి రూ.1,32,80,000, యాడికి 1286 మందికి రూ.1,21,80,000, పెద్దపప్పూరు 876 మందికి రూ.84,02,500 లక్షలు, పెద్దవడుగూరులో 888మందికి రూ.85,40,000 చొప్పున నిధులు జమయ్యాయన్నారు.

కల్యాణం...కమనీయం

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులో వెలసిన శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. మొదటగా స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అక్కిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి మెమో

అనంతపురం క్రైం: భవన నిర్మాణ అతిక్రమణలను అడ్డుకోవడంలో విఫలమైన ముగ్గురికి నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి బుధవారం మెమో జారీ చేశారు. కమిషనర్ రమణారెడ్డి రెండ్రోజుల క్రితం నగరంలోని హౌసింగ్ బోర్డులో పర్యటించారు. రాజీవ్‌చిల్డ్రన్స్ పార్క్ సమీపంలో ఓ నిర్మాణదారుడు కాలువకు ఆనుకుని నిర్మాణం చేపట్టారు. దీనిపై కమిషనర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి, పట్టణ ప్రణాళిక కార్యదర్శి నరేష్, లైసెన్స్ టెక్నికల్ పర్సన్ షఫీవుల్లాకు మెమో జారీ చేశారు.

రాయలసీమ ఫిల్మ్ డిస్ట్రిబూటర్స్ కమిటీ ఎన్నిక



సాయి మహేశ్వరరెడ్డి



గిరిషా

గుంతకల్లు: రాయలసీమ ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ నూతన కమిటీని బుధవారం గుంతకల్లులో ఎన్నుకున్నారు. 2023–24 సంవత్సరానికి గాను అసోసియేషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా జీ.సాయిమహేశ్వరరెడ్డి, కార్యదర్శిగా గిరిషా, ఉపాధ్యక్షుడిగా హెచ్.శ్రీనివాసరావు, సహాయకార్యదర్శిగా గులాం ఖాదర్, కోశధికారిగా రవికుమార్ ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా యం.తిమ్మప్ప, లక్ష్మీకాంతరెడ్డి, ఉదయ్‌కుమార్‌తోపాటు కార్యవర్గసభ్యులుగా మరో ఏడుగురిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు.

నేడు భగీరథ మహర్షి జయంతి

గుత్తి: పట్టణంలోని ఉప్పర వీధిలో గురువారం భగీరథ మహర్షి జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఉప్పర(సగర) సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 7 గంటల నుంచి జయంతి వేడుకలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని పత్తికొండ రోడ్డులో బుధవారం బైక్‌పై నుంచి పడి ఓవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. పట్టణానికి చెందిన ఇస్మాయిల్ తన పిల్లలను బైక్‌లో పాఠశాలలో వదిలి పెట్టి తిరిగి ఇంటికి బయలు దేరాడు. అయితే రోడ్డుకు అడ్డంగా కుక్క రావడంతో దాన్ని తప్పించబోయి బైక్‌పై నుంచి కిందపడ్డాడు. ప్రమాదంలో గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

పామిడి: స్థానిక బీసీ కాలనీలో బుధవారం విద్యుదాఘాతంతో ఓ ఆవు మృతి చెందింది. వివరాలు.. బీసీ కాలనీలోని ఓ ఇంటి సమీపంలో ఉన్న టెలిఫోన్ స్తంభానికి విద్యుత్ సరఫరా అయ్యింది. ఈక్రమంలో ఆవు స్తంభాన్ని తగలగానే ఒక్కసారి షాక్‌కు గురై అక్కడే మృతి చెందింది. ఘటన స్థలాన్ని విద్యుత్ సిబ్బంది పరిశీలించారు. మృతి చెందిన ఆవు ఎవరిదనేది తెలియరాలేదు.

నేటి నుంచి వాసవీ మాత జయంత్యుత్సవాలు

తాడిపత్రి టౌన్: స్థానిక మెయిన్ బజార్‌లోని కన్యాక పరమేశ్వరిదేవి ఆలయంలో గురువారం నుంచి ఈనెల 30 వరకు వాసవీ మాత జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తలుపుల సురేంద్రనాథ్, కార్యదర్శి జయవరం అశ్వత్థ రంగయ్య తెలిపారు. నాలుగు రోజుల పాటు రోజుకొక అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



గుత్తి: స్థానిక రైల్వే స్టేషన్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన పవన్ కుమార్ అనే వ్యక్తి రైలు ఇంజిన్ కు ఉన్న విద్యుత్ వైర్‌ను పట్టుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. యూపికి చెందిన పవన్ కుమార్ తన భార్య బెంగళూరులో ఉండటంతో ఆమెను కలవడానికి వెళ్లాడు. అయితే ఆమె అతనితో రావడానికి నిరాకరించింది. దీంతో మనస్తాపం చెందిన పవన్‌కుమార్ ఎలహంక టూ కాచిగూడ రైల్లో తిరుగు ప్రయాణమయ్యాడు. అయితే గుత్తి రైల్వే స్టేషన్‌లో రైలు ఆగిన సమయంలో ఇంజిన్‌కు ఉన్న విద్యుత్ వైరు పట్టుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ప్రమాదంలో పవన్‌కుమార్ శరీరం సుమారు 40 దాకా శాతం కాలిపోయింది. జీఆర్‌పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు తదితరులు పవన్‌కుమార్‌ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేశారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాల ప్రారంభం

గార్లదిన్నె: యర్రగుంట్లలో వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాల బుధవారం ప్రారంభమైంది. ఈసందర్భంగా ఉదయం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం గంగపూజ, గణపతి పూజ, గోపూజ చేపట్టారు. అనంతరం ధ్వజ స్తంభానికి 101 బిందెల జలంతో అభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.